
• నగరంలోని హాస్టల్ నుంచి విద్యార్థులను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు


• పరీక్ష పూర్తయ్యాక విద్యార్థినుల సందడి

ముగిసిన ఇంటర్ పరీక్షలు


ఇంటి బాట పట్టిన విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 14: ఇంటర్ పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు పూర్తికాగా గురువారం ద్వితీయ సంవత్సరం పరీక్షలు పూర్తయ్యాయి. చివరి రోజు జరిగిన కెమిస్ట్రీ, కామర్స్ పేపర్-2 పరీక్షలకు మొత్తం 15,698 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 15,230 మంది హాజరుకాగా 468 మంది గైర్హాజరయ్యారు. డీఈసీ కమిటీ 10, హెచ్‌పీసీ కమిటీ 4, ఫ్లయింగ్ సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 31, డీఐఈవో 6 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి

పరీక్షలు ముగియడంతో పరీక్షా కేంద్రాల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా బయటకు వచ్చారు. పరీక్ష ప్యాడ్‌లు, పేపర్‌లు గాల్లోకి ఎగిరేసి కేరింతలు కొట్టారు. ఒకరి కొకరు సెల్ఫీ తీసుకున్నారు. కాగా, విద్యార్థుల తల్లిదండ్రులు ఉదయం నుంచే హాస్టల్స్ వద్ద వేచి ఉన్నారు. తల్లిదండ్రులు, సంరక్షకులు వెంట రాగా విద్యార్థులు తమ ఇళ్లకు బయలుదేరారు. దీంతో బస్టాండ్, రైల్వే స్టేషన్లు విద్యార్థులతో కిక్కిరిసిపోయాయి.


• పరీక్షలు ముగియడంతో విద్యార్థుల కేరింతలు


• బస్టాండ్ వద్ద విద్యార్థులు




• సాలూర చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ పోలీసుల బందోబస్తు



• ఇటీవల మహారాష్ట్ర ఎక్సైజ్ పోలీసులతో జిల్లా ఎక్సైజ్ అధికారుల సమన్వయ సమావేశం

మద్యం, మత్తు పదార్థాలపై నిఘా

- ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎక్సైజ్, మహారాష్ట్ర పోలీసుల జాయింట్ ఆపరేషన్
- మహారాష్ట్ర నుంచి దేశీదారు, గంజాయి, ఎన్‌డీపీ మద్యం రాకుండా పకడ్బందీ చర్యలు
- అదనంగా ఆరు చెక్‌పోస్టుల ఏర్పాటు

సుభాష్‌నగర్, మార్చి 14: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోకి మత్తు పదార్థాలు, అక్రమంగా మద్యం, దేశీదారు రాకుండా ఉండేందుకు జిల్లా ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టారు. గత కొన్ని రోజులుగా మహారాష్ట్ర నుంచి దేశీదారు, నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం, గంజాయి వంటి మత్తుపదార్థాలను కొందరు వ్యక్తులు జిల్లాలోకి తెచ్చి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. వీటిని అరికట్టేందుకు మహారాష్ట్ర సరిహద్దులో ఎక్సైజ్ పోలీసులు మహారాష్ట్ర ఎక్సైజ్ అధికారులతో సమన్వయం సమావేశం ఏర్పాటు చేసి నివారించేందుకు చర్యలు చేపట్టేందుకు సన్నద్ధమయ్యారు. ముఖ్యంగా మహారాష్ట్ర సరిహద్దు సుమారు 48 కిలోమీటర్ల పొడవు ఉండగా వాటి సరిహద్దు గ్రామాల నుంచే జిల్లాలోకి అక్రమ మద్యంతో పాటు మత్తు పదార్థాలు వస్తున్నాయి. నాలుగు సరిహద్దు మండలాలైన పోతంగల్, రేంజల్, బోధన్, సాలూర మండలాల ద్వారా గుట్టుగా తరలిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసు అధికారులు గుర్తించారు. వీటిని అరికట్టేందుకు మహారాష్ట్ర పోలీసులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమన్వయ సమావేశంలో మహారాష్ట్ర డిప్యూటీ కమిషనర్ బీహెచ్ తడ్వితో పాటు జిల్లాకు చెందిన డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, మహారాష్ట్ర ఎక్సైజ్ సూపరింటెండెంట్ అతుల్ కన్వాడేలతో మహారాష్ట్రలోని కార్నపాట గ్రామంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోకి అక్రమ మద్యం, మత్తుపదార్థాలను తరలించకుండా అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించి నిర్ణయాలను తీసుకున్నారు.

మహారాష్ట్ర నుంచి మద్యం, గంజాయి సరఫరా..

జిల్లాలోకి మహారాష్ట్ర నుంచే అక్రమ మద్యం, మత్తు పదార్థాలైన గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వస్తున్నట్లు సమాచారం మేరకు మహారాష్ట్ర పోలీసులతో సమన్వయం చేసుకొని అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. గతంలో సైతం జిల్లాలో దొరికిన మత్తు పదార్థాలు మహారాష్ట్ర నుంచి వచ్చినవే కావడంతో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించనున్నారు. దీంతోపాటు మహారాష్ట్ర నుంచి ఎక్కువగా వచ్చే దేశీదారు మద్యాన్ని సరఫరా చేసే వారిపై కూడా నిఘా పెట్టారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో జిల్లా ఎక్సైజ్ పోలీసులు మహారాష్ట్ర పోలీసుల సహకారంతో ఎట్టి పరిస్థితుల్లో జిల్లాలోకి మత్తుపదార్థాలు రాకుండా సీరియస్‌గా దృష్టి సారించారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

జిల్లా నుంచి మహారాష్ట్రకు కల్లు తరలింపు

మహారాష్ట్ర నుంచి మత్తుపదార్థాలు, దేశీదారు మద్యం జిల్లాలోకి వస్తుంటే మహారాష్ట్రకు మాత్రం జిల్లా నుంచి కృత్రిమ కల్లును సరఫరా చేస్తున్నట్లు మహారాష్ట్ర పోలీసులు జిల్లా ఎక్సైజ్ అధికారులకు తెలిపినట్లు సమాచారం. మహారాష్ట్రలోకి కల్లు రాకుండా చూడాలని మహారాష్ట్ర పోలీసులు కోరారు. గతంలో కృత్రిమ కల్లును రైళ్లతో పాటు ప్రత్యేక వాహనాల్లో మహారాష్ట్రలోకి అక్రమంగా సరఫరా చేస్తు పట్టుబడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. మహారాష్ట్ర ఎక్సైజ్ పోలీసులు తెలంగాణ నుంచి కల్లు సరఫరాను అడ్డుకునేందుకు జిల్లా అధికారుల సహకారం కోరినట్లు తెలుస్తోంది. దీంతో రెండు రాష్ట్రాల ఎక్సైజ్ పోలీసులు సమన్వయంతో ఈ అక్రమదందాకు చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టనున్నారు.

సరిహద్దుల్లో అదనంగా ఆరు చెక్‌పోస్టుల ఏర్పాటు

మహారాష్ట్ర నుంచి వచ్చే గంజాయి, నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం, దేశీదారుల అక్రమ సరఫరాను అడ్డుకునేందుకు ప్రత్యేకంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా నుంచి మహారాష్ట్రకు, మహారాష్ట్ర నుంచి జిల్లాకు సరఫరా కాకుండా ఉండేందుకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఆరు చెక్‌పోస్టులను అదనంగా ఏర్పాటు చేశారు. ఇందులో సాలూర, యంచ చెక్‌పోస్టులు ఇది వరకు ఉండగా అదనంగా కందకుర్తి, కండేగాం, పోతంగల్, మందర్నలలో సైతం చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర పోలీసులు సైతం మహారాష్ట్ర సరిహద్దులో మూడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి జిల్లాలోకి ఎలాంటి మత్తు పదార్థాలు రాకుండా చర్యలు చేపట్టారు. ఇరు రాష్ట్రాల పోలీసులు జాయింట్ రైడ్స్‌తో అక్రమ దందాను అరికట్టేందుకు సీరియస్‌గా దృష్టి సారించారు.



• రెండు కిలోల అల్ప్రాజోలం తరలిస్తుండగా జిల్లా ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడిన రాజస్థాన్‌కు చెందిన భవాని సింగ్

జాయింట్ ఆపరేషన్‌తో అక్రమ రవాణాకు చెక్..

:మల్లారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్



వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టి ఉంచుకొని జిల్లాలోకి మత్తు పదార్థాలు, అక్రమ మద్యం రాకుండా చర్యలు చేపట్టాం. మహారాష్ట్ర ఎక్సైజ్ పోలీసులతో కలిసి జాయింట్ ఆపరేషన్ నిర్వహించనున్నాం. దీనికోసం ప్రత్యేకంగా చెక్‌పోస్టులను అదనంగా ఏర్పాటు చేశాం. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేశాం.


• డొంకేశ్వర్‌లో మక్కలను మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

మక్కలకు మంచి ధర

- క్వింటా రూ.2150 మద్దతు ధర
- సిండికేట్‌గా ఏర్పడిన వ్యాపారులు
- ధర తగ్గిస్తున్నారని వాపోతున్న రైతులు

డొంకేశ్వర్, మార్చి 14: యాసంగి సీజన్‌కు సంబంధించిన మక్క కోత దశకు చేరుకుంది. రైతులు ఆశించిన విధంగానే మక్కలకు మంచి ధర లభిస్తుండడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. గ్రౌండ్ వాటర్ అధికంగా ఉండడంతో రైతులు మక్క సాగుకు మొగ్గుచూపారు. డొంకేశ్వర్ మండల వ్యాప్తంగా సుమారు 1100ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు అయింది. వార్షకాలంలో మక్క సాగు విస్తీర్ణం ఎక్కువైనప్పటికీ అధికంగా కురిసిన వర్షాల వల్ల మక్కలకు దిగుబడి ఆశించిన స్థాయిలో రాక రైతులు నష్టపోయారు. పౌల్ట్రీ పరిశ్రమకు మక్కలు ఎక్కువగా అవసరం ఉండడంతో యాసంగి సీజన్‌లో మక్కల సాగు చేస్తే లాభాలు దక్కించుకోవచ్చు అని రైతులు ఆశించారు. వర్షాకాలం కంటే యాసంగి సీజన్‌లో మక్కల దిగుబడి తక్కువగా ఉంటుంది. ఒక ఎకరం విస్తీర్ణంలో పంటకు 30క్వింటాళ్ల నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి లభిస్తుంది. మొక్కలకు తాజాగా క్వింటాలుకు రూ.2150మద్దతు ధర పలికింది. మక్క పంట కోతలు అంతటా పూర్తి అయ్యేసరికి ధర తగ్గే అవకాశం ఉందని వ్యాపారస్తులు చెబుతున్నారు. క్వింటాలుకు రూ.2వేల ధర ఉండే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. కొనుగోలు ప్రారంభంలో రూ.2150 ధర వారం తర్వాత రూ.2125ధర పలకడంతో ఏకంగా క్వింటాలుకు రూ.25 చొప్పున తగ్గించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పుడు ఉన్న ధర మార్కెట్ లోనే ఎక్కువ ఉండడంతో మక్క సాగు వల్ల నష్టమే మి లేదని వాదనలు రైతుల నుంచి వినిపిస్తుంది. ఇప్పుడు మక్కలకు తేమ శాతం తక్కువగా ఉండే అవకాశం ఉండడంతో రైతులు వెంటనే అమ్మేందుకు వీలుంటుంది. చివరి వరకు ధర తగ్గకుండా ఉండే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

మక్కలకు మరింత ధర పెరగాలి..

:చిన్నారెడ్డి, రైతు, నూత్‌పల్లి



ఈ సంవత్సరం మూడు ఎకరాల్లో మక్క పంట సాగు చేశాను. గత ఏడాది కంటే ఈ సారి మక్కలకు మంచి ధర ఉంది. క్వింటా రూ.2500 ధర ఉంటే రైతులకు పెట్టుబడి ఖర్చులు పోను లాభదాయకంగా ఉంటుంది. ఈ ధర మార్కెట్‌లో ఉంటే రైతులు జొన్నకు బదులు మక్క పంటను వేసేందుకు ఆసక్తి చూపుతారు.


మామిడిపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ శాసన సభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పక్కన ఎంపీ అర్వింద్

తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

ఆర్మూర్ రూరల్, మార్చి 14 : తప్పుడు హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. గురువారం మామిడిపల్లిలోని విజయలక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించిన బీజేపీ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ గెలిచి 90రోజులు అవుతున్నా ఇప్పటికీ హామీలు నెరవేర్చలేదన్నారు. 412 హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేస్తుందన్నారు. యువకులు ఉద్యోగాలు, ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారని.. నిరుద్యోగ భృతి ఏమైందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని ప్రచారాలు చేస్తుందని, అవి ప్రధాన మంత్రి అవాస్ యోజన ఇళ్లేనని ఈ విషయాన్ని అసెంబ్లీలో తాను నిలదీస్తానని మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్ర ప్రజలపై పెనుభారం వేశారని, వారు మాత్రం కమీషన్‌లు తీసుకొని లబ్ధిపొందారని ఆరోపించారు. ప్రపంచ పటంలో భారతదేశాన్ని మూడో ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారన్నారు.రానున్న ఎన్నికల్లో బీజేపీని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.

అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తాం : ఎంపీ అర్వింద్

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే మూత పడి ఉన్న షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరించాలన్నారు. పసుపు పంటకు మంచి ధర లభిస్తుండడంతో.. రైతులు సంతోషంగా ఉన్నారని అర్వింద్ తెలిపారు. ఆర్మూర్, మంచిర్యాల రోడ్డు వెడల్పు పనులకు రూ.4వేల కోట్లు మంజూరు అయితే.. అందులో రూ.3100కోట్ల పనులు నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోనే ఉన్నాయన్నారు. తాను రెండు కేంద్రీయ విద్యాలయాలు, జగిత్యాల్‌కు నవోదయ పాఠశాలను మంజూరు చేశానని తెలిపారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థులు కరువయ్యారని.. అందుకే కుల రాజకీయాలకు పాల్పడుతున్నారని ఎంపీ అర్వింద్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కులచారి దినేష్, సీనియర్ నాయకులు పల్లె గంగారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, స్రవంతిరెడ్డి, బోగ శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఏఆర్ కానిస్టేబుల్ మృతి

ఖిల్లా, మార్చి 14: ఈనెల 12న రోడ్డు ప్రమాదానికి గురైన ఏఆర్ కానిస్టేబుల్ శంకర్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వల్లె శంకర్ ఈనెల 12న 6వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు బల మైన గాయాలు కావడంతో ఆయన్ను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతదేహాన్ని జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహం వద్ద పూలమాలలు పెట్టి అదనపు డీసీపీ నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వల్లె శంకర్ 1990లో కానిస్టేబుల్‌గా విధుల్లోకి చేరాడని, మృతుడికి కుమారుడు, కూతురు తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో ఏఆర్ ఏసీపీ కె.నాగయ్య, రిజర్వు ఇన్‌స్పెక్టర్ వెంకటి, ఆర్ఎస్సై దత్తు, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్‌పాషా, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మృతుడి కుటుంబానికి పోలీస్‌శాఖ ద్వారా అన్నిరకాల సహాయ సహకారాలు అందించనున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ తెలిపారు.

నగరంలో చిరుత కలకలం

సుభాష్‌నగర్, మార్చి 14: నగరంలో చిరుత పులి సంచారం కలకలం రేపింది. గురువారం ఉదయం కంఠేశ్వర్‌లోని రైల్వే బ్రిడ్జి ప్రాంతంలో చిరుత సంచరిస్తుందంటూ ఫారెస్టు అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. స్పందించిన ఫారెస్టు అధికారులు రైల్వే బ్రిడ్జి ప్రాంతానికి చేరుకొని అక్కడ చిరుత సంచరించిన ఆనవాళ్లను తెలుసుకునేందుకు చర్యలు చేపట్టారు. స్థానిక 3వ టౌన్ పోలీసులతోపాటు చిరుత సంచరిస్తుందన్న ప్రాంతాలను పోలీసులు పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న పాదముద్రలను పరిశీలించారు. చివరకు చిరుత పాదం ముద్ర గుర్తులు కావని, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పద్మారావు వివరించారు. స్థానికులు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరించినట్లు ఎలాంటి ఆనవాళ్లు వెల్లడించారు.



చిరుత ఆనవాళ్లను పరిశీలిస్తున్న పోలీసులు

గోదాంల నిర్మాణాలకు ప్రొసీడింగ్ కాపీల అందజేత


ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, మార్చి 14: మండలంలోని కమ్మర్‌పల్లి, కోనాసముందర్ సహకార సంఘాల గోదాంల నిర్మాణాల నిమిత్తం రాజ్యసభ ఎంపీ సంతోష్‌కుమార్ నిధులనుంచి మంజూరైన రూ.20 లక్షల ప్రొసీడింగ్ కాపీలను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి గురువారం ఆయా సొసైటీల చైర్మన్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ సంతోష్‌కుమార్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి, కోనాసముందర్ సొసైటీల చైర్మన్ లు రేగుంట దేవేందర్, సామబాపు రెడ్డి, ఎంపీటీసీ సుధాకర్, వైస్ ఎంపీపీ కలేరి శేఖర్, ఆకుల రాజన్న, ఇంద్రాల రాజు, పేరం లింబాద్రి, నాయకులు గడ్డంస్వా మి, బద్రి, హరీష్, మహేందర్, గంగారెడ్డి ఆయా సొసైటీల డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, మార్చి 14: ఈజేహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టుకు పొరుగు సేవల పద్ధతిన భర్తీ చేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్‌నెస్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. నియామకం అనంతరం వారికి నెలకు రూ.58,500 చొప్పున వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర వైద్యమండలిచే గుర్తింపు పొందిన ఎంబీబీఎస్ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు 16వతేదీ సాయంత్రం 5గంటల లోపు జిల్లా కేంద్రం లోని పాత నగరపాలక సంస్థ కార్యాలయ సమీపంలోని వెల్‌నెస్ సెంటర్‌లో సంబంధిత ధ్రువపత్రాలను జతపర్చిన దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి,మార్చి 14: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (సుద్దపల్లి)లో 6,7,8,9 తరగతిలో ఖాళీగా మిగిలిపోయిన సీట్లను భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గోదావరి తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నమని ఈనెల 23వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని, ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహణ ఉంటోందని సుద్దపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సి పాల్ గోదావరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవలన్నారు.

ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఫలితాల విడుదల

● సైనిక్ స్కూల్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులకు ర్యాంకులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 14:ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్షలో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లా నుంచి విద్యార్థులు ర్యాంకులు సాధించారు. 300 మార్కులకు గాను పరీక్షలు నిర్వహించగా మైదం వర్షిత్‌వర్మ 274 మార్కులు సాధించి ఆల్ ఇండియా లెవల్‌లో 373వ ర్యాంకు సాధించారు. సాన్విరెడ్డి 412వ ర్యాంక్, పూర్ణచందర్ 8283వ ర్యాంకు, బృణాల్‌రెడ్డి 12808వ ర్యాంకు, విశ్వజిత్ 12835వ ర్యాంక్, గంగసహస్ర 18625వ ర్యాంకు, అడంజొనాతన్ 21393వ ర్యాంకులు సాధించారు.

రూ. 20లక్షల అల్ఫాజోలం పట్టివేత

సుభాష్‌నగర్, మార్చి 14: కల్తీకల్లు తయారీలో వాడు తున్న అల్ఫా జోలం మత్తుపదార్థాన్ని అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రెండు కేజీల అల్ఫాజోలంను జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ హోటల్ వద్ద ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాల యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. అనుమా నాస్పదంగా కారులో వెళ్తున్న భవాని సింగ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా అతని వద్ద సుమారు 20లక్షల రూపాయల విలువ గల అల్ఫాజోలం మత్తుపదార్థం లభించినట్లు తెలిపారు. రాజ స్థాన్ రాష్ట్రంలోని నాగూర్ జిల్లాకుచెందిన భవానిసింగ్ రాజ స్థాన్‌లోని ముఖేష్‌సింగ్ నుంచి అల్ఫా జోలం తీసుకొచ్చి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన సుదర్శన్‌కు అమ్మను న్నాడని తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టం 1985ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి కార్యచరణ నిమిత్తం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ కామారెడ్డిలో అప్పజెప్పడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో నిజామాబాద్ ప్రొహి బిషన్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు డి.చంద్రబాబునాయక్, సీఐలు స్వప్న, వెంకటేష్, ఎస్‌ఐలు విక్రం కుమార్, నర్సింహచారి, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు


కేక్‌కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కమ్మర్‌పల్లి, మార్చి 14: మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకను మండల పార్టీ కార్యాలయంలో మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ కేక్‌కట్‌చేసి పంపిణీ చేశారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపీటీసీ సుధాకర్,రాజేశ్వర్, చిన్నారెడ్డి, సుభాష్ గౌడ్, మ ల్యాయి రాజన్న ఒంకార్ శ్రీను, సంత రాజేశ్వర్, తదితరనాయకులు పాల్గొన్నారు.

21న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక

ఆర్మూర్‌టౌన్, మార్చి14: ఈనెల 21న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక ఉన్నట్టు ఎన్నికల అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.మాజీమున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్‌లు డిసెంబర్‌లో అవిశ్వాస పరీక్ష నిర్వహించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయగా జనవరి 4న అధికారులు అవిశ్వాస పరీక్షను నిర్వహించారు. అవిశ్వాస పరీక్ష నెగ్గినట్టు అధి కారులు తెలపగా పండిత్ వినీత 2/3 సభ్యులు ఓటు వేయలేదని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు పిటిషన్‌ను కొట్టివేస్తూ విశ్వాస పరీక్ష నెగ్గిందని తీర్పు వెలువడించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్యదర్శి ఇటీవల వైస్ చైర్మన్ షేక్ మున్నకు నూతన చైర్మన్ ఎన్నిక అయ్యే వరకు ఇన్‌చార్జీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకోవాల్సిందిగా ఉత్తర్వులు వెలువడించడంతో మం గళవారం ఆయన ఇన్‌చార్జీ చైర్మన్‌గా బాధ్యతలను చేపట్టారు. కాగా బుధవా రం రాష్ట్ర ఎన్నికల అధికారి ఈనెల 21న కొత్త చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని ఉత్తర్వులు వెలువడించడంతో కొత్త చైర్‌పర్సన్ ఎన్నికపై ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి: ఎమ్మెల్యే ధన్‌పాల్


మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

నిజామాబాద్ అర్బన్, మార్చి 14: మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని, మహిళలకు తగిన గౌరవం ఇవ్వాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెలే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో గురువారం మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రంగాలలో ప్రతిభ కనబర్చిన మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళలు తమనుతాము ముందుగా గౌరవించుకోవాలని ఆతర్వాత అందరిని గౌరవించాలన్నారు. ఆటపాటల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, ట్రెయినీ కలెక్టర్ కిరణ్మయి, మహిళ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి ఎస్‌కే రసూల్‌బీ, డీఎంహెచ్‌వో సుదర్శనం, మైనార్టీ సంక్షేమశాఖ అధికారిణి కృష్ణవేణి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాణి, ఎంసీహెచ్‌ఆర్‌డీ ట్రెయినీ కోఆర్డినేటర్ వసుంధర, స్నేహ సొసైటీ దివ్యాంగుల ప్రిన్సిపల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో ప్రభుత్వ భూమి స్వాధీనం



హద్దురాళ్లను ఏర్పాటు చేస్తున్న అధికారులు

ఆర్మూర్‌రూరల్, మార్చి14: ఆర్మూర్ మున్సిపల్ పరిధి మామిడిపల్లి శివారులోని 44వ జాతీయరహదారి అనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని ఎట్టకేలకు గురువారం నేషనల్ హైవే అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'భూం ఫట్ ' అక్రమణకు గురవుతున్న రూ.4కోట్ల భూమి అని ప్రచురితమైన కథనానికి స్పందించిన నేషనల్ హైవే అధికారులు తమ భూమిని కాపాడుకోవడానికి నడుం బిగించారు. సుమారు రూ.4కోట్ల విలువైన ఈ భూమిని గతంలో జాతీయరహదారి నిర్మాణంలో పట్టాదారులకు నష్టపరిహారాన్ని అందజేసి భూమిని సేకరించారు. రహదారి నిర్మాణం పూర్తి కాగా మిగిలిన భూమి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకే చెందుతుంది. ఇట్టి భూములపై ఆర్మూర్‌కు చెందిన కొందరు కన్ను వేసి కబ్జా చేసి ప్రహరీ నిర్మించి బోరు వేశారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. స్పందించిన అధికారులు మొదట వచ్చి పరిశీలించి వెళ్లారు. అనంతరం నేషనల్ హైవే అధికారులు, రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో సంయుక్తంగా కబ్జాకు గురైన భూమిలో నిర్మించిన ప్రహరీని జేసీబీతో కూల్చివేసి హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. కోట్ల విలువైన భూమిని హైవే అధికారులు స్వాధీనం చేసుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇట్టి భూమిలో ప్రజల సౌకర్యార్థం పార్క్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పవన్, సైట్ ఇంజనీర్ రవిశంకర్ కుమార్, రూట్ ఆపరేషన్ మేనేజర్ విరాజ్ దేశ్‌పాండే, వీరబాబు, రామారావు, సర్వేయర్ శికారి రాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎఎస్సై లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోలింగ్ కేంద్రాలలో సదుపాయాలు కల్పించాలి

● అదనపు కలెక్టర్ అంకిత్


కొత్తపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

ముప్కాల్, మార్చి14: పోలింగ్ కేంద్రాలలో మౌళిక వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు ఆదేశించారు. గురువారం బాల్కొండ మండల కేంద్రంతో పాటు కొత్తపల్లి, రెంజర్ల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రతీ పోలింగ్ కేంద్రా లలో తాగునీరు, విద్యుత్; ఫర్నీచర్, మరుగుదొడ్లు, టెంట్ వంటి వస తులు కల్పించాలని సూచించారు. వికలాంగులకు కోసం ప్రత్యేకంగా ర్యాంప్‌లను పరిశీలించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఇబ్బం దులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్, పంచాయతీసెక్రెటరీ, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎడపల్లి,మార్చి 14:ఎడపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ ధన్వాల్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఆడపిల్ల పెళ్లికి తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశ్యంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా ఒక లక్షా నూట పదహారు రూపాయల ఆర్థిక సాయాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా మండలంలో 6 కల్యాణలక్ష్మి, 36 షాదీ ముబారక్‌చెక్కులను అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వినోద్ తదితరులు ఉన్నారు.

ఒడ్డెర కాలనీ గ్రామ పంచాయతీ సందర్శన


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారులు

మోపాల్, మార్చి 14: మండలంలోని ఒడ్డెర కాలనీ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్యం గురించి కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచా యతీ పనులను చిత్తశుద్ధితో చేయాలని సూచించారు. గ్రామస్థులకు అందుబాటులో ఉండి వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామ పంచాయతీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ బూత్ లెవల్ ఆఫీసర్‌లకు త్వరలో జరుగబోయే ఎంపీ ఎన్నికల దృష్ట్యా ఓటరు లిస్టుకు సంబంధించి పలు సూచనలు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సందర్శించారు. లబ్ధిదారుల కోసం కల్పిస్తున్న సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ప్రజాపాలన సేవా కేంద్రంలో నిరంతరంగా కొనసాగుతోందని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.ప్రతీ ఒక్కరు 'క్యూ' పద్ధతిని పాటించి సహకరించాలని లబ్ధిదారులను కోరారు. ప్రజాపాలన కేంద్రం వద్ద తాగు నీటితో పాటు కుర్చీలను ఏర్పాటు చేసి మూడు కంప్యూటర్లను కౌంటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. టోకెన్ పద్ధతి ద్వారా దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో లింగం నాయక్, మండల గ్రామ పంచాయతీ అధికారి మహ్మద్ ఎక్బాల్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ప్రతీ ఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలి

బోధన్ రూరల్, మార్చి 14: ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని, భక్తి మార్గంతోనే సన్మార్గంలో నడుస్తామని మల్లారం స్వామి, సాధువులు అన్నారు. బోధన్ పట్టణంలోని బసవ తారకనగర్‌లో శ్రీ కోట మైసమ్మ సహిత లక్ష్మీ నరసింహస్వామి ద్వాదశ 12వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్ర మాలు నిర్వహించారు. ఆలయంలో హోమం, యజ్ఞ కార్యక్ర మాలతో పాటు సహస్ర కుంకుమార్చన, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పసులోటి గోపికిషన్, ఆలయ కమిటీ సభ్యులు గౌతమ్‌గౌడ్, లోకేష్‌గౌడ్, లింగంలతో కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ డంపింగ్ సీజ్


ఇసుక డంపింగ్ యార్డ్ సీజ్ చేస్తున్న దృశ్యం

జక్రాన్ పల్లి,మార్చి 14:జక్రాన్‌పల్లి మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో గురువారం రాత్రి ఇసుకఅక్రమ డంపింగ్ సీజ్ చేసిన పోలీసులు, రెవెన్యూ, మైన్స్ అధికారులు, సుమారుగా 58 ట్రాక్టర్ల టిప్పర్లను ఇ సుకను సీజ్ చేసినట్లు ఆర్ఐ ప్రవీన్‌తెలిపారు.

వైభవంగా బోనాల ఊరేగింపు

ధర్పల్లి, మార్చి 14: మండల కేంద్రంలో గురువారం బోనాల పండుగ అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్దమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా బోనా లను ఊరేగించారు. గ్రామంలోని వివిధ కాలనీల నుంచి ఊరేగింపుగా బోనాల ను గ్రామ శివారులోగల పెద్దమ్మతల్లి దేవాలయంలో సమర్పించారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈ బోనాల ఊరేగింపులో గ్రామంలో పండుగ వాతా వరణం నెలకొంది. బోనాల ఊరేగింపుతో ఉత్సవాలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఫోన్ పోతే ఇంటినుంచే ఫిర్యాదు చేయవచ్చు

ఖిల్లా, మార్చి 14: వివిధ కారణాల వల్ల మొబైల్ పోగొట్టుకున్న వారు ఇంటినుంచే పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని పోలీస్ శాఖ తెలిపింది. ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా ఇంటి నుంచే ఫిర్యాదు చేయడానికి ఇతర నెంబర్ నుంచి వాట్సాప్‌లో 94406 27057కు హాయ్ అని మెస్సేజ్ పంపాల్సిన ఉంటోంద న్నారు. వెంటనే గూగుల్‌పేకు ఉన్న లింక్ వస్తుంది. దానిపై క్లిక్ చేసి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ఐఎంఈఐ నెంబర్, తదితర వివరాలు నమోదు చేయాలి. అలా చేస్తే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు వెళ్లి నిఘా ప్రారంభం అవుతుందని మీ ఫోన్ ఎక్కడుందో తెలుసుకొనే అవకాశం ఉంటుందని పోలీస్ శాఖ తెలిపింది.

నవీపేటలో రెండోసారి వాయిదా పడిన వారంతపు వేలంపాట

నవీపేట,మార్చి14: నవీపేటలో ప్రతీ శుక్రవారం జరిగే వారంతపు సంత, శనివారం జరిగే మేకల సంతలకు సంబంధించిన వేలంపాటను గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. మేకల సంత వేలంపాటలో 49మంది పాల్గొనగా నవీపేటకు చెందిన మజర్ 40.35లక్షలకు వేలంపాట పాడారు. వారంతపు సంత వేలంపాటలో 24మంది పాల్గొనగా నవీపేటకు చెందిన మజర్ 4.61లక్షలకు వేలంపాట పాడారు. సంతలకు సంబంధించిన వేలంపాటలో అప్‌సెట్ ధర రాకపోవడంతో వేలంపాటను ఈ నెల 19వ తారీఖు మంగళవారం రోజుకు వాయిదా వేయడం జరిగిందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవీందర్‌నాయక్, పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి మండవ లేఖ

సుభాష్‌నగర్,మార్చి 14: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి మండవ వెంక టేశ్వర్‌రావు బహిరంగ లేఖ రాశారు. సమా జంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన అన్ని కులాల సంక్షేమం కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలన్న నిర్ణయం అభినందనీయ మన్నారు. కమ్మ కులస్థులు చట్ట పరంగా అగ్ర వర్ణమే అయిన ఆకులంలో మెజార్టీ ప్రజలు పేదరికంలో మగ్గిపోతు న్నారని అన్నారు. అగ్రవర్ణమైన కమ్మ వారిలో సైతం ఆర్థికంగా చాలా మంది వెనుకబడి ఎందరో ఉన్నారన్నారు. పిల్లల చదువులకు ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని మెరిట్ ఉన్న అభ్యర్థులు ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే చదువును ఆపేస్తున్న పరిస్థితిఉందన్నారు. మిగతా కులాల మాదిరిగా కమ్మ సంక్షేమ కార్పొ రేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు.కమ్మవారి సంక్షేమం కోసంకార్పొ రేషన్ ఏర్పాటు చేసిన తొలిసీఎంగా మీపేరు ఉండిపోతుందన్నారు. తక్షణమే కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవాల్సిందిగా కోరారు.

రుద్రూరు ఎస్‌బీఐ ఏటీఎంలో భారీ చోరీ

● అర్ధరాత్రి వేళ ఏటీఎం ధ్వంసం ● రూ. 20 లక్షల నగదును దోచుకెళ్లిన దుండగులు ● ఘటనా స్థలిని పరిశీలించిన బోధన్ ఏసీపీ


ఏటీఎం మిషన్ పరికరాలను పరిశీలిస్తున్న సీఐ


పరిశీలిస్తున్న క్లూస్ టీమ్ బృందం

రుద్రూరు, మార్చి 14: ఏటీఎంను ధ్వంసం చేసిన దుండగులు అందులోని రూ. 20లక్షల నగదును దోచుకుని పరారైన ఘటన రుద్రూరులో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రుద్రూరు మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పై ఎస్‌బీఐ ఏటీఎం ఉంది. బుధవారం అర్ధరాత్రి ముసుగులు ధరించిన కొందరు దుండగులు ఏటీఎం లోపలికి ప్రవేశించారు. పక్కా ప్లాన్‌తో ఏటీఎం సెంటర్‌లోని సీసీ కెమెరాలపై నల్ల రంగు స్ప్రేను కొట్టి లోపలికి చొరబడ్డారు. ఆతర్వాత గ్యాస్ కట్టర్ల సహాయంతో ఏటీఎంను ధ్వంసం చేసి.. అందులో ఉన్న సుమారు రూ.20 లక్షల నగదును దోచుకెళ్లారు. సమాచారం అందుకున్న బోధన్ ఏసీపీ శ్రీని వాస్‌రావు, వర్ని ఎస్సై కృష్ణలు బుధవారం ఘటనా స్థలిని పరిశీలించారు. రోడ్డుపైపడేసిన ఏటీఎం మిషన్ పరికరాలను, సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఘటన స్థలంలో క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలను సేకరించారు. ఎస్‌బీఐ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ రావు తెలిపారు.

మున్నూరు కార్పొరేషన్ ఏర్పాటుపై సంబురాలు

నిజామాబాద్ రూరల్, మార్చి 14: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో రూరల్ కాంగ్రెస్ నేతలు సంబురాలు జరిపారు. గురువారం ఖానాపూర్, సారంగపూర్, పొల్గ, మల్లారం గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు టపాసులు పేల్చి సంబురాలు చేశారు. స్వీట్లు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ కాంగ్రెస్ నేతలు కొర్వ రాజేందర్ ప్రసాద్, యాదయ్య, శ్రీనివాస్‌తదితరులున్నారు.